



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి
చర్యలు తీసుకోవాలి

- సబ్‌ప్లాన్ నిధులు దళిత, గిరిజనుల అభ్యున్నతికి కేటాయించాలి
- జిల్లాలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తా
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

6

రైతులు దళారుల మాటలు నమ్మొద్దు

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

8



అయోధ్యపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో తలుపులేని డార్మెటరీ గది



మహాముత్తారం మండలంలోని వసతి గృహంలో మంచాలు లేక ఇరుకు గదిలోనే నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి విజిట్ Visit

వసతి గోస!



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి ఆశ్రమ పాఠశాలలో ఊడిపోయిన తలుపు



లక్నవరం? బాలిక వసతి గృహంలో దొడ్డు బియ్యం అన్నం



వరంగల్ జిల్లా : నల్లబెల్లి బీసీ వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం



హనుమకొండ జిల్లా కాజీపేట బీసీ సంక్షేమ హాస్టల్‌లో నేలపై నిద్రిస్తున్న విద్యార్థి, ఆ పక్కనే పని చేయని సీలింగ్ ఫ్యాన్



జనగామ జిల్లా దేవరుప్పుల బీసీ హాస్టల్‌లో 32 మందికి గానూ 9 మంది మాత్రమే ఉన్నారు. వార్డెన్, నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో పర్యవేక్షణ కరువై.. విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని చెబుతున్నారు.



భూపాలపల్లి జిల్లా చిట్యాల వసతి గృహంలో కిటికీ తలుపు పోవడంతో రక్షణగా కట్టిన గోనెసంచి

- సమస్యల వలయంలోనే వసతి గృహాలు
- ప్రభుత్వాలు మారుతున్నా స్థితిగతులు మారని వైనం
- సరైన సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు
- చాలీచాలని బెడ్లు, దుప్పట్లతో చలికి వణుకుతూ నిద్ర
- వేడినీరు లేక చన్నీటి స్నానాలు
- తలుపులు, అద్దాలు లేని కిటికీలతో దోమల రొద
- రక్షణ చర్యలు కానరాక భయంభయంగా ఆశ్రయం

7

అధ్వానంగా ఉమ్మడి వరంగల్ జిల్లా సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ

శిథిలమైన భవనాలు.. పెచ్చులూడే స్లాబులు.. వర్షం పడితే కురిసే గదులు.. తలుపుల్లేని కిటికీలు.. కానరాని రక్షిత తాగునీటి సదుపాయాలు.. నీరురాని స్నానాల గదులు, కంపు కొట్టే మరుగుదొడ్లు.. ప్రహరీలు కూలిన ఆవరణలు.. ఇలా ఒకటేమీ.. సవాలక్ష సమస్యలతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తున్నా.. నిర్వహణ గురించి పట్టించుకునేవారు లేక పేద చిన్నారులు దిక్కుతోచని స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వసతి గృహాల స్థితిగతులు, నిర్వహణ తీరుపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం నిర్వహించిన పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. చాలీచాలని గదులు, సక్రమంగా లేని బెడ్లు, నాసిరకం దుప్పట్లతో చలికి వణుకుతూ.. సంఖ్యకు తగినట్టుగా లేని గదుల్లో కిటికీలు, తలుపులు సక్రమంగా లేక దోమల రొదతో రాత్రంతా జాగారం చేస్తున్నారు. మెజారిటీ హాస్టళ్లలోని వేలాదిమంది విద్యార్థులు ఇలాంటి సమస్యలతోనే సతమతమవుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల్లో నీరు రాక, శుభ్రంగా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల ఎప్పుడు కూలతాయో తెలియని భవనాల్లో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ.. మరికొన్ని చోట్ల పాడైపోయిన కూరగాయలతో చేసిన వంటలు తింటూ.. ఇంకొన్ని చోట్ల విషసర్పాలు, కీటకాల భయంతో ఆశ్రయం పొందుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ విద్యార్థులకు సంక్షేమంతో పాటు ఉన్నత విద్యనందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్ల రూపు మారడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఉమ్మడి వరంగల్ నెట్‌వర్క్

వడ్ల కొనుగోళ్లలో రైతులకు
ఇబ్బంది కలుగవద్దు

- గ్రూపు-3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మహబూబాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి గ్రూప్-3 పరీక్షల నిర్వాహణ, ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వాహణ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలు, తదితర అంశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలు గూర్చి వివరించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, జిల్లా అధికారులు బాల్‌రామ్‌నాయక్, సుబ్బారావు, పురుషోత్తం, మధూసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, విజయనిర్మల, రాజేశ్వర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, నర్మద పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- 20వ తేదీ వరకు నిర్వహణ
- విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం (నేటి) నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత బుధవారం తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల, కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. వారోత్సవాల ప్రారంభం రోజున జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14న ఉదయం 11 గంటలకు ఆరు నుంచి పదో తరగతి (హైస్కూల్)



జిల్లా కేంద్ర గ్రంథాలయం

విద్యార్థులకు (నెహ్రూ గారి చిత్రపటం)పై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15న ఉదయం 11 గంటలకు పుస్తక ప్రదర్శన, 16న ఉదయం 11 గంటలకు హైస్కూల్ విద్యార్థులకు 'దేశాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, మధ్యాహ్నం 12 గంటలకు కళాశాల విద్యార్థులకు 'నిరుద్యోగం- ఉపాధికల్పన' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 17న ఉదయం 10.30 గంటలకు హైస్కూల్ విద్యార్థులకు పుస్తక పఠనం -ప్రయోజనాలు, ఉదయం 11.30 గంటలకు కళాశాల విద్యార్థులకు జాతీయ సమైక్యత-యువత కర్తవ్యం అనే అంశంపై వక్తృత్వపోటీలుంటాయని చెప్పారు. 18న ఉదయం 10.30 గంటలకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు దేశభక్తి, జానపద గేయాలపై పాటల పోటీలు, 19న కళాశాల విద్యార్థినీలకు, మహిళలకు రంగోలి పోటీలు, 20న ఉదయం 11 గంటలకు ముగింపు ఉత్సవాల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్యఅతిథులుచే బహుమతులు అందించనున్నట్లు శ్రీలత తెలిపారు. వ్యాసరచన, వకృత్వ పోటీలు తెలుగు, ఇంగ్లీష్ బాషల్లో నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమపేర్లను జిల్లా గ్రంథాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు.

కార్తీకపున్నాన కందగిరికి
పోదాం పదా..

భక్తి పారవశ్యం, ప్రకృతి సోయగం, కందికొండ జాతర

- వేధిస్తున్న రహదారులు, నీటి సమస్యలు
- రేపు లక్ష్మీనర్సింహాస్వామి జాతర



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం గర్భగుడిలో పూజలు (ఫైల్)



కురవి మండలం కందికొండలో 3 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కందగిరి పర్వతం

కురవి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కపిలవాయి మహాముని తపస్సుచే పునీతమై, శ్రీలక్ష్మీనర్సింహస్వామి వెలసిన కందికొండ జాతర కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన శుక్రవారం జరుగనుంది. కందికొండ శివారు కందగిరి పర్వతంపై రెండు శతాబ్దాలుగా జరుగుతున్న ఈ జాతరకు పూర్వపు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలోని వేలాదిమంది భక్తులు విచ్చేస్తారు. జాతర చరిత్రలోకి వెళ్లితే.. హిరణ్యకశకుని సంహారం అనంతరం నరసింహాస్వామి లక్ష్మీదేవితో భూతలముపై సంచరిస్తూ అనేక ప్రదేశాలలో అర్చామూర్తిగా వెలుగొందాడు. సంహాద్రి, వేదాద్రి, కందాద్రి (కందికొండ) తదితర గిరులపై కాలిడి స్వయంభువుగా వల్మీకరూపంలో వెలిశాడు.

కార్తీకపౌర్ణమి రోజు జరిగే నర్సింహాస్వామి, లక్ష్మీదేవిల వివాహానికి హాజరైతే కోరిన కోర్కెలు తీరుతాయని ప్రతీతి ఉండటంతో భక్తులు పెద్దఎత్తున కందికొండ జాతరకు తరలివస్తారు.

కందగిరి భూతల స్వర్గం..

భక్తి పారవశ్యానికే కాకుండా కందికొండ పర్వతం ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా ఉంటుంది. పూర్వకాలంలో ఈ గుట్టపై దొరకని వనమూలిక లేదట! ఈ గుట్టను అధిరోహించే భక్తులకు అనేక ప్రకృతిఅందాలు అలరిస్తాయి. కొండపైన అసంఖ్యాకమైన పుష్కరిణి (కోనేరు)లు ఉన్నాయి. స్వామి పుష్కరిణి, దిగువ పుష్కరిణిలు సహా, సప్త పుష్కరిణులు ఉంటాయి. వీటినే ఏడుదోనలు

మిగతా 8వ పేజీలో...

సమస్యలతో భక్తుల ఇబ్బందులు

మూడు కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అనేక ఇబ్బందులు పడుతుంటారు. పూర్తిస్థాయిలో మెట్లులేకపోవడంతో భక్తులు చెట్లు, పొదలు, గుట్టల మీదుగా పర్వతాన్ని అధిరోహిస్తారు. గుట్టపై తాగునీటి సౌకర్యం, లేకపోవడంతో కోనేరు(పుష్కరిణి)లో నీటిని తాగుతారు. ప్రధాన రహదారి నుంచి కందగిరి పర్వతం వరకు రెండుకిలోమీటర్ల దూరం సరైన రహదారి లేకపోవడంతో గుట్ట వద్దకు చేరుకునేందుకు భక్తులు అనేక ఇబ్బందులు పడుతారు. కందికొండ గ్రామం నుంచి భక్తులు వచ్చేందుకు వీలుగా నాగలకుంట కట్ట నుంచి నేలకోట వరకు రహదారి నిర్మించాలనే, పర్వతంపై, సత్రాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలనే భక్తుల డిమాండ్‌లు డిమాండ్‌గానే మిగిలి ఉన్నాయి.

రైతులకు న్యాయం జరిగేలా చర్యలు

రామన్నగూడెంలో వరి పంట పరిశీలన ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వరిని పరిశీలిస్తున్న ఏవో వినయ్‌కుమార్

నర్సింహులపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు కంపెనీ వరి వంగడంతో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో రైతులను ముంచిన నకిలీ విత్తనాలు..' ఓ కంపెనీ వరివంగడం కొని తీవ్రంగా నష్టపోయిన రైతులు, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఆలస్యంగా వెలుగులోకి అనే కథనం బుధవారం ప్రచురణ కావడంతో ఏవో స్పందించారు.

రామన్నగూడెం, కౌసల్యదేవిపల్లి, బొజ్జ న్నపేట, జయపురం గ్రామాల్లో సందర్శించి బాధిత రైతుల పంటచేలను పరిశీ లించారు. రైతుల నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించామని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఏవో తెలిపారు. నకిలీవిత్తనాలు సరఫరా చేసిన కంపెనీని సీజ్‌చేసి బాధిత రైతులకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం అందించాలని రైతుకూలీ సంఘం నాయకులు సోమిరెడ్డి డిమాండ్ చేశారు.

18.7 కిలోల గంజాయి పట్టివేత



గుంటూరుపల్లి స్టేజీ వద్ద నర్మెట పోలీసులు పట్టుకున్న గంజాయి

నర్మెట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రం నుంచి గుజరాత్‌లోని సూరత్‌కు రైలులో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని నర్మెట పోలీసులు అదుపులోకి తీసున్నారు. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన తుకున ప్రధాన్ అనే వ్యక్తి అదే రాష్ట్రంలోని పోల్నాని గ్రామానికి చెందిన వసంత్ వద్ద 18.7కిలోల గంజాయిని కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో అధిక ధరకు విక్రయించడానికి ఈస్ట్‌కోస్ట్ రైలులో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్‌లో రైల్వే పోలీసులు ఈస్ట్‌కోస్ట్ రైలు ఎక్కి తనిఖీలు చేస్తుండగా ప్రధాన్ భయపడి జనగామ రైల్వే స్టేషన్‌లో దిగిపోయాడు.

అక్కడ నుంచి పారిపోయే క్రమంలో ఆటో ఎక్కి నర్మెట గ్రామానికి వచ్చాడు. తిరిగి వెళ్దామని బస్సు కోసం గుంటూరుపల్లి స్టేజీ వద్ద వేచి ఉండగా అనుమానం వచ్చిన ఎస్సై అతడిని తనిఖీ చేయగా రెండు ట్రాలీ బ్యాగులలో 10 గంజాయి పాకెట్లలో 18.7 కిలోలు లభ్యమైంది. ప్రధాన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ యుగేంధర్ రెడ్డి

చిలుపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండ లంలోని చిన్నపెండ్యాలలో నిర్వహించిన మండల సంస్థాగత ఎన్నికల నిర్వహణ కార్యశాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గత రెండు పర్యాయాలుగా చేపట్టిన ప్రజాకర్షక పథకాలతో పాటు, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. కేంద్రంలో ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మరోసారి బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. బీజేపీ మండలా ధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, అయిలోని అంజిరెడ్డి, మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు ఆరూరి ప్రణీత - ప్రభుదాస్, నాయకులు దోమ రవిందర్ రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, మధునాయక్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుగేంధర్ రెడ్డి

ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరించాలి

- సబ్‌ప్లాన్ నిధులు దళిత, గిరిజనుల అభ్యున్నతికి కేటాయించాలి
- జిల్లాలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మహబూబాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్నవాటిని పక్షం రోజుల్లో పరిష్కరించి నివేదిక అందజేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం చైర్మన్‌తో పాటు సభ్యులు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ప్రజాకవి కాళోజీ నారాయణరావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను చైర్మన్‌కు వివరించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల వివరాలు ఇతర అంశాలను కమిషన్ చైర్మన్‌కు దృష్టికి తీసుకెళ్లారు. భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎంతమంది బాధితులకు పరిహారం అం దిందని సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి నర్మదను అడిగి తెలుసుకున్నారు.



మహబూబాబాద్‌లో అంబేద్కర్, కాళోజీ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న బక్కి వెంకటయ్య, కలెక్టర్, అధికారులు

మూడు నెలలకు ఒకసారి సమావేశాలు

మూడు నెలల కొకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లాలో దళితుల భూముల సమస్యలకు సంబంధించి వారం రోజుల్లో నివేదికను అందించాలని చెప్పారు. ప్రతీ నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే సివిల్ రైట్స్‌డేకు అన్ని కులాల ప్రతినిధులు హాజరయ్యేలా అధికారులు చూడాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల బాధితులకు పరిహారం అందేలా సీఎం దృష్టికి తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. భూ సమస్యలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టుల కోసం రూ.వెయ్యి కోట్లు

జిల్లాలో బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని, అందుకు ప్రతిపాదనలు పంపించాలని బక్కి వెంకటయ్య సూచించారు. ప్రతీ మూడునెలల కొకసారి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తే ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా చదువుపై ఆసక్తి కలిగే విధం గా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల శాఖ లో పథకాల అమలుకు పెండింగ్ ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, అందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో నమోదైన కేసులపై తహసీల్దార్ల నుంచి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజుల్లో సమగ్ర నివేదికను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారం తదితర అంశాలకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నూనావత్ రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అదనపు ఎస్పీ చెన్నయ్య, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కామ సంజీవరావు, గుగులోతు కిషన్‌నాయక్, గడ్డం అశోక్, డాక్టర్ పరికిపండ్ల అశోక్, గుండాల నర్సయ్య, జిల్లా అధికారులు నర్మద, పురుషోత్తం, మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, మరియన్న, సుబ్బారావు, నర్సింహాస్వామి, హరిప్రసాద్, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని తెలంగాణకు అంకితమిచ్చిన మహనీయుడు కాళోజీ

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి అరాచక పాలనకు వ్యతిరేకంగా తన కలం ఎత్తి ఎదురు తిరిగిన గొప్ప నాయకుడు కాళోజీ అని, బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం ప్రజా కవి కాళోజీ నారాయణ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని మాధాపురంలో ఆయన చిత్రపటానికి దయాకర్‌రావు పూల మాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళోజీ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి గౌరవించిందన్నారు. ఆయన జీవిత చరిత్రను ముందు తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో కేసీఆర్ హన్మకొండలో కాళోజీ కళాక్షేత్రం నిర్మించారన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుంద ర్‌రామ్ రెడ్డి, మండల నాయకులు బస్వ మల్లేశం, రామ్‌సింగ్, మడికొండ ఎల్లయ్య, కృష్ణమూర్తి, రంగయ్య, యాకూ, సోమనర్సయ్య, బీ వెంకన్న పాల్గొన్నారు.



మాధాపురంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎర్రబెల్లి

రెండు లారీలు ఢీ

- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్లు
- నాలుగు గంటల పాటు నరకయాతన



లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్లను బయటకు తీస్తున్న ఎస్సై సతీష్

కురవి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు (జి) శివారు బంచరాయితండ వద్ద మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో రెండు లారీలు ఢీకొన్నాయి. భూపాలపల్లి నుంచి పాల్వంచకు వెళ్తున్న లారీ, పాల్వంచ నుంచి భూపాలపల్లి వెళ్లే లారీ ఢీ కొట్టింది.

ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లు క్యాబిన్‌లలో ఇరుక్కుపోయారు. ఎస్సై సతీష్‌కు సమాచారం అందడంతో రాత్రి 10.30 గంటల సమయంలో ఘటన స్థలానికి వెళ్లిన ఎస్సై సతీష్ క్రేన్, జేసీబీల సాయంతో నాలుగు గంటల పాటు శ్రమించి ఇద్దరు డ్రైవర్లను క్యాబిన్‌ల నుంచి బయటకు తీయించారు. అనంతరం డ్రైవర్లను జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. లారీ యజమానురాలు శాంతిప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్టణ అభివృద్ధికి పాటుపడతాం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరులోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపాలిటీల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. తొర్రూరు మునిసిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని, ప్రతిపక్షాల మాట లు నమ్మవద్దని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అభివృద్ధి చేస్తుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. కోటి రూపాయల నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఇతర పనుల కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కె.నిరంజన్ రెడ్డి, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, నరేందర్ రెడ్డి, గుండాల నర్సయ్య, వార్డు కౌన్సిలర్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న యశస్విని రెడ్డి

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో సందడి నెలకొంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బుధవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమం వద్ద గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపు సమర్పించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శుభానందాదేవి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గులు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములకు దీపాదానం అందజేశారు. లక్ష పత్రి పూజలు, అడవిలో వెలిసిన ఆది ముక్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, సంగమేశ్వరుడు, దత్తాత్రేయుడికి పలు ప్రత్యేక పూజలు చేశారు.



కాళేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు

గోదావరికి హారతి

కార్తీక మాసం సందర్భంగా పంచరత్నాల్లో భాగంగా బుధవారం గోదావరి హారతిని నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ప్రధాన రాజగోపురం నుంచి మంగళ వాయిద్యాలతో గోదావరి వద్దకు ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు చేరుకున్నారు. గోదావరి నది హారతికి ఇచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్థులు, వెంకట అన్నమాచార్య సేవా సమితి సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన!

సస్పెండ్ చేయాలని తల్లిదండ్రుల ఆందోళన

నర్మెట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులతో ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, అతడిని సస్పెండ్ చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేసిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలో బుధవారం జరిగింది. నర్మెట మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు కర్ణాకర్ కొంత కాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ పుష్పకుమారి కర్ణాకర్‌ను మందలించినా అతని బుద్ధి మాత్రం మారలేదు. చివరకు ఈ విషయం విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు బుధవారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలంటూ ఆందోళన చేశారు. దాంతో ఎంఈవో ఐలయ్య, ఎస్సై నగేష్ పాఠశాలకు వచ్చి విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో మాట్లాడారు. ఓ మహిళా ఉపాధ్యాయురాలు, విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించిన వారు పై అధికారులకు విషయం తెలియజేసి కర్ణాకర్‌పై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ పుష్పకుమారి తెలపడంతో విద్యార్థినులు తల్లిదండ్రులు శాంతించారు.

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ఇన్‌చార్జ్ కుమారస్వామి

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నపుడే సమాజంలో భవిష్యత్ తరాలు పటిష్ఠంగా నిర్మించబడతాయని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ఇన్‌చార్జి డొనికెన కుమారస్వామి అన్నారు. బుధవారం తొర్రూరులోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో నవంబర్ 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా పిల్లలకు హక్కులపై అవగాహన సదస్సు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే అన్ని అంశాలపై బాల బాలికలు అవగాహన కలిగి ఉం డాలన్నారు. టెక్నాలజీకి బానిసలు కావద్దని, అవసరం ఉన్న మేరకే వినియోగించాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులదే భవిష్యత్ తరమని, ఉన్నత చదువులు చదువుకుని లక్ష్యాలను సాధించాలని తెలిపారు.

ఆయా పాఠశాలల్లో వ్యాసరచన, బాలల స్ఫూర్తి సందేశాలపై అవగాహన చేపట్టి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ముత్తినేని జయప్రకాశ్, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్, రవీంద్రనాథ్, వేణుమాధవ్, ప్రభాకర్, భానుచందర్, నాగరాజు, గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండపాన్ని వినియోగంలో తీసుకురావాలి

అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పాలకుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో రోహిత్‌సింగ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలోని పాల్కూరికి సోమనాథుడి స్మృతి వనం వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు పర్యాటక కేంద్రాలను సందర్శించే విధంగా అభివృద్ధి చేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న కుల గణన సమగ్రంగా ఉండాలని అన్నారు. అదే విధంగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐ రాకేష్ తదితరులు ఉన్నారు.



పాలకుర్తిలో అధికారులతో సమీక్షిస్తున్న రోహిత్‌సింగ్

హోరాహోరీగా భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్

సెమీ ఫైనల్‌కు చేరిన పలు జట్లు

మరిపెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూళ్లో మూడు రోజులుగా జరుగుతున్న భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్ పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలోని 935 మంది విద్యార్థులు 11 ఈవెంట్లలో పాల్గొని, తమ శక్తి సామర్థ్యాలను చాటుకుంటున్నారు. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింట్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. మూడోరోజు పలు జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. ఇప్పటికే రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, క్యారమ్స్ చెస్ పోటీలు ముగిశాయి. మూడురోజు క్వార్టర్ ఫైనల్ పోటీలను స్థానిక సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ టాసేసి ప్రారంభించారు. బుధవారం జరిగిన టెన్నికాయిట్ (డబుల్స్) అండర్ 14లో మరిపెడ, నర్సంపేట ప్రథమ, ద్వితీయ టైటిల్స్ సాధించగా, అండర్ 17లో మరిపెడ, పరకాల, అండర్ 19లో మరిపెడ, దమ్మపేట పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. చెస్ (సింగిల్)లో అండర్ 14, 17, 19 విభాగంలో పరకాల, అక్కిరెడ్డిపల్లి, పాల్వంచ, ముదిగొండ, ముదిగొండ, పాల్వంచ జట్లు గెలుపొందాయి. క్యారమ్స్ (డబుల్స్) లో నర్సంపేట, మణుగూరు, మరిపెడ, సత్తుపల్లి, తిరుమలాయపా లెం, అక్కిరెడ్డిపల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. మూడోరోజు విజేతలకు సీఐ రాజ్‌కుమార్ గౌడ్ స్థానిక సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ దయాకర్‌తో కలిసి మెమొంటోలను అందించారు.



రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న సీఐ రాజ్‌కుమార్

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2480	2080
పల్లికాయ (సూక)	5550	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	---	---
పెసళ్లు	6302	5900
పత్తి	6860	5800
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	4555	4555
పసుపు (గోల)	3855	3855
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16500	14000
వండర్‌హాట్ ఏసీ	13200	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ అధ్వానం

ఇబ్బందులు పడుతున్న హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని వసతి గృహాల విద్యార్థులు



ఎల్కతుర్తిలో అధ్వానంగా ఎస్సీ బాలుర హాస్టల్ గది, గోడలకు చెమ్మ

హనుమకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయి. అసౌకర్యాల మధ్యే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మచ్చుకైనా కనిపించడం లేదు. చాలా హాస్టళ్లు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వర్షం పడితే కురిసే గదులు.. తలుపుల్లేని కిటికీలు.. మరుగుదొడ్లు.. నీరు లేని స్నానాల గదులు.. ఒక్కటేమిటీ.. సవాలక్ష సమస్యలు చుట్టుముట్టాయి. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ వసతి గృహాల సమస్యలు తీరడం లేదు. ఈ రెండు జిల్లాల్లోని సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఐదేళ్లుగా దుప్పట్లు పంపిణీ చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చలికాలం కావడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న దుప్పట్లు, బెడ్‌షీట్లతోనే సరిపెట్టుకుంటున్నారు. కొన్ని హాస్టళ్లలో బెడ్లు లేక నేలమీదే పడుకుంటున్నారు. పాడైపోయిన ఫ్యాన్లను మరమ్మతులు చేసేవారు లేక.. దోమల రొదను భరిస్తూనే నిద్రపోతున్నారు.

సమస్యలు అనేకం

హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల గోపాల్‌పూర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్ మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. పరకాల పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో ఫ్యాన్లు తిరగడం లేదు.

మరమ్మతు కోసం తీసి పక్కనబెట్టారు. కిటికీలకు మెస్‌లు లేవు. స్నానాల గదులు సరిగా లేవు. బెడ్లు లేక విద్యార్థులు నేలమీదే పడుకుంటున్నారు. చలికాలం కావడంతో చల్లదనానికి సక్రమంగా నిద్రపట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కమలాపూర్ మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ ఆవరణలో పాముల పుట్టలు ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. భవనం పూర్తిగా పాతపడిపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని భయపడుతున్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో దోమల బెడద తీవ్రంగా ఉంది. శాయంపేట ఎంజేబీ బాలుర హాస్టల్ సోలార్ వాటర్ హీటర్ లేక విద్యార్థులు చలిలోనూ చన్నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. ములుగు జిల్లా మంగపేట ఎంజేబీ బాలుర హాస్టల్‌ను కూడా ఇక్కడే



మంచాలు లేక నేలపై నిద్ర పోతున్న విద్యార్థులు

ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు గదులు సరిపోవడం లేదు. శాయంపేటలోని కస్తూర్బా బాలిక హాస్టల్‌లో భూపాలపల్లి హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేశారు. అలాగే ఎంజేబీ బాలుర హాస్టల్‌లో మంగపేట హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గదులు చాలక, సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హసన్‌పర్తిలోని ఎంజేబీ వసతి గృహంలో అద్దెభవనంలో అరకొర వసతుల నడుమ కునారిల్లుతోంది. చింతగట్టులోని కస్తూర్బా హాస్టల్‌కు వెళ్లడానికి రోడ్డు సరిగాలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వేలేరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలను కొద్ది రోజుల కిందట ఆరెపల్లికి తరలించారు. అక్కడ తాగునీటి వసతి లేదు. కలెక్టర్ ప్రావీణ్య ఇటీవల ఆ హాస్టల్‌ను సందర్శించి తాగునీటి ఇబ్బందిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. బాలసముద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో కిటికీలు సరిగా లేవు. దుప్పట్లు ఇవ్వలేదు. దొడ్డు బియ్యంతో భోజనం పెడుతున్నారు. విద్యార్థులు



పరకాల ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లకు ఉన్న విరిగిన తలుపులు

తినలేకపోతున్నారు. ఆత్మకూరు మండలంలోని బీసీ ఎస్సీ, హాస్టళ్లలో కనీస వసతులు లేవు. ఇటీవల బీసీ హాస్టల్ మూతపడింది. ఎస్సీ హాస్టల్ అరకొర వసతుల మధ్య నడుస్తోంది. ఎస్సీ హాస్టల్ చుట్టూ ముళ్లపొదలు ఉండడంతో విష సర్పాలు, కీటకాలకు నిలయంగా మారింది. కొందరు ఆకతాయిలు హాస్టల్ సమీపంలోనే గంజాయి, మద్యం తాగుతున్నారు. ఇది చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్ నుంచి తీసుకు పోతున్నారు. ప్రస్తుతం 37 మందే ఉన్నారు. కాజీపేట బీసీ హాస్టల్ విద్యార్థులు బెడ్లు లేక నేలమీదే పడుకుంటున్నారు. ఫ్యాన్లు పని చేయడం లేదు. బీసీ హాస్టల్ భవనాన్ని కస్తూర్బా బాలిక హాస్టల్ కోసం ఇచ్చి దీనిని పక్కనే ఉన్న బాలుర ఉన్నత పాఠశాల ఆవర ణలోకి మార్చారు.

అక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడు తున్నారు. హనుమకొండ జిల్లాలోని దాదాపు అన్ని హాస్టళ్లలో భోజ నం నాసిరకంగా ఉంటోంది. సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా.. దొడ్డు బియ్యంతోనే భోజనం పెడుతున్నారు. పప్పు.. చారులా, చారు నీళ్లలా ఉంటోంది. ఇక పాలు.. నీళ్లకు తేడా తెలియడం లేదు. పండ్ల ధరలు పెరగడంతో విద్యార్థులకు కనీసం అరటి పండు కూడా ఇవ్వడం లేదు. గ్యాస్, నిత్యావసరాల ధరలు పెరగడంతో అల్పాహారం కింద కిచిడీ చేసి పెడుతున్నారు. వారంలో ఒక్కసారే గుడ్లు ఇస్తున్నారు. కుళ్లిన కూరగాయలతో కూరలు చేసి పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. చెన్నారావుపేట కస్తూర్బా గురుకుల విద్యాలయంలో 298 మంది విద్యార్థులుండగా, దుప్పట్లు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. నర్సంపేట గిరిజన హాస్టల్‌లో 225 మంది విద్యార్థులుండగా, జూలై నుంచి ఇప్పటివరకు కాస్మెటిక్ చార్జీలు చెల్లించలేదు. వసతి గృహం నుంచి పాఠశాలకు వెళ్లేదారి గుంతలమయంగా ఉంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నల్లబెల్లి బీసీ వసతి గృహంలో 38 మంది విద్యార్థులుండగా భవనం శిథిలావస్థలో ఉంది. పర్వతగిరి బీసీ హాస్టల్‌లో కిటికీలకు తలుపులు లేక 40మంది విద్యార్థులు దోమలతో సావాసం చేస్తున్నారు. మినరల్ వాటర్ లేక భగీర థ నీటిని తాగుతున్నారు. ఖానాపురం మండలం అశోక్‌నగర్ గిరిజన సైనిక్ స్కూల్‌లో 700మంది ఉండగా, ప్రహరీ లేక పశువులు ఆవరణలోకి వస్తున్నాయి. అంతర్గత రోడ్డు లేక వర్షాకాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంగెం ఎస్టీ హాస్టల్‌లో 68 మంది విద్యార్థులు ఉండగా, మినరల్ వాటర్ అం దించడంలేదు. నెక్కొండ ఎస్టీ వసతిగృహంలో కూడా ఇదే పరిస్థితి నెల కొంది. కిటికీలకు గ్లాస్ డోర్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దుగ్గొండి బీసీ వసతి గృహంలో 43 మంది విద్యార్థులు ఉండగా కిటికీ లకు అద్దాలు లేకపోవడంతో దోమలు వస్తున్నాయని విద్యార్థులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు.



నల్లబెల్లి బీసీ హాస్టల్ భవనం స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం



పర్వతగిరి బీసీ వసతిగృహంలో గ్లాస్ డోర్ లేకుండా ఉన్న కిటికీ

అసౌకర్యాల హాస్టళ్లు

- కరువైన కనీస వసతులు
- నిర్వహణ అస్తవ్యస్తం

ఆంధ్రజ్యోతి విజిట్ Visit

భూపాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. విద్యార్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా12 మండలాల్లో మొత్తం 23 వసతిగృహాలు ఉన్నాయి. ఎస్టీ ఒకటి, బీసీ రెండు, ఎస్సీ రెండు, సంక్షేమ వసతి గృహాలతో గిరిజన ఆశ్రమ పాఠశాల ఒకటి ఉంది. కస్తూర్బా 11, మోడల్ స్కూల్స్ ఆరు ఉన్నాయి. వీటిలో విద్యార్థులకు స్నానం చేసేందుకు వేడి నీళ్ల అందని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గతంలో సోలార్ సిస్టంను ఏర్పాటు చేసినా దాని నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రస్తుతం వేడినీళ్ల కరువయ్యాయి. కనీసం ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టకపోవడంతో విద్యార్థులు చలిలో చన్నీటి స్థానాలు చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నారు. జిల్లాలోని చాలా మండలాల్లో వసతి గృహాల్లో విద్యార్థులు

అధ్వానస్థితిలో భూపాలపల్లి జిల్లా హాస్టళ్లు

పడుకునే గదులకు కిటికీలు కూడా సరిగ్గా లేకపోవడంతో రాత్రిళ్లు చల్లటి గాలులతో విద్యార్థులు గజగజ వణుకుతూ నిద్రించాల్సిన పరిస్థితి. చాలా ఏళ్లుగా పరుపులు లేవు. ఇళ్ల నుంచి బెడ్ షీట్లు, దుప్పట్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. చిట్యాల మండలంలో ఒక బీసీ, ఒక ఎస్సీ, రెండు బాలికల ఎస్సీ వసతి గృహాలు ఉండగా ఎస్సీ వసతి గృహాల్లో సోలార్ సిస్టం దెబ్బతినడంతో విద్యార్థులు స్నానం చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

విద్యార్థులు నిద్రించే గదులకు కిటికీలు లేకపోవడంతో చలి నుంచి రక్షణ కోసం విద్యార్థులు గోనె సంచులను అడ్డుగా కట్టుకున్నారు. కిటికీలను మరమ్మతు చేయించాలని ఎన్నిసార్లు కోరినా పట్టించకొనే వారే కరువయ్యారు. మహాముత్తారం మండలంలో విద్యార్థులకు సరిపడా మంచాలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైన నిద్రిస్తున్నారు. రేగొండ మండలంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో కిటికీలకు మెష్ లేకపోవడంతో దోమల బెడద అధికంగా ఉంది. ఇక్కడ సోలార్ గీజర్ పనిచేయడం లేదు.

- కిటీలకు తలుపులేక దోమల విజృంభణ
- శిథిలావస్థలో భవనాలు.. అద్దె భవనాలే దిక్కు
- నాసిరకం భోజనంతో విద్యార్థుల ఇబ్బందులు

మల్హర్ మండలంలోని ఎస్టీ వసతి గృహంలో తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ పని చేయక పోవడంతో మిషన్ భగీరథ ద్వారా ఇచ్చిన నీటిని విద్యార్థులు తాగుతున్నారు. ఇక్కడ కూడా సోలార్ గీజర్ పని చేయడం లేదు. హాస్టల్ ముందు కాంపౌండ్ కూలి పోవడంతో రక్షణ లేని పరిస్థితి నెలకొంది. కాటారం మండ లంలో రెండు ఎస్సీ బాలికల వసతిగృహాలు ఉండగా విద్యార్థిను లు లేక గంగారం హాస్టల్ మూతపడింది. కాటారం వసతి గృహంలో 52 మంది విద్యార్థులు ఉన్నా ఇక్కడ ఆర్వో ప్లాంట్ మూలన పడడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థు లకు రగ్గులు లేకపోవడంతో చలికి సమస్యలు ఎదుర్కొంటున్నారు. గీజర్ ఏర్పాటు చేయకపోవడంతో చన్నీటితో స్నానాలు చేయలేక అవస్థలు పడుతున్నారు.

మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని బీసీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాలకు సంబంధించి హాస్టల్లో కోతుల బెడద అధికంగా ఉంది.సోలార్ సిస్టం తరచూ దెబ్బతింటూ పనిచేయని పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు స్నానాల కోసం వేడి నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారు. ఆర్వో ప్లాంట్ కూడా పనిచేయకపోవడంతో బయట నుంచి నీటిని కొనుగోలు చేసి విని యోగిస్తున్నారు. ఈ వసతి గృహంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి వసతి గృహం పరిసరాలు కంపుకొడుతు న్నాయి. మహదేవపూర్ మండలంలో ఎస్సీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ బాత్రూంలకు నీటి సరఫరా జరగడం లేదు. తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అయితే.. మెనూ ప్రకారమే హాస్టళ్లలో ఆహార పదార్థాలను అందిస్తున్నారు.



మహదేవపూర్‌లో శిథిలావస్థకు చేరిన హాస్టల్

కష్టాల.. లోగిళ్లు

ములుగు జిల్లా వసతి గృహాల్లో సమస్యల దరువు

ములుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారే తప్ప మౌలిక సౌకర్యాల కల్పనలో పాలకులంతా నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. తరగతి గదుల్లోని పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో విద్యార్థులు భయంభయంగా చదువుల సాగిస్తున్నారు. గదులు, ఆవరణలో పారిశుధ్యం లోపించింది. సరిపడా మరుగుదొడ్లు లేవు. ఆర్వో వాటర్‌ప్లాంటు నిరుపయోగంగా మారింది. సరిపడా బాత్రూమ్‌లు లేవు. రామాంజపురం చెంచుకాలనీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల కూడా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోననే భయం విద్యార్థుల్లో నెలకొంది. కస్తూర్బా బాలికల పాఠశాలలో తాగునీటి సమస్య, జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌లో కోతల బెడదతో విద్యార్థులు తిప్పలపడుతున్నారు.

జిల్లాకేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహం కూడా శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఇరుకైన గదుల్లో విద్యార్థులు నిద్రిస్తున్నారు. వసతిగృహం పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం, వసతుల పునరుద్ధరణ కోసం అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. కానీ, ఇంకా అమలు కాలేదు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఇటీవల జిల్లాస్థాయి అధికారులు ఆయా హాస్టళ్లలో ఒకరోజు నిద్ర చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ దివాకర సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే.. చలికాలం ప్రారంభమైనప్పటికీ చాలా హాస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పెచ్చులూడుతున్న బూర్గుపేట గిరిజన గురుకుల భవనం



పస్రా ఎస్టీ బాలుర హాస్టల్‌లో కిటికీలు లేని దృశ్యం

ఏజెన్సీ హాస్టళ్లు అధ్వానం

ఏజెన్సీ మండలాల్లోని హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయి. మంగపేట కేజీబీవీ, చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవు. నీటి కొరత తీవ్రంగా ఉంది. గోవిందరావుపేట మండలం పస్రా ఎస్టీ బాలుర హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విషపురుగుల బెడదతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కిటికీలు విరిగిపోయాయి. ఫ్లోరింగ్ దెబ్బతింది. చలికాలం ప్రారంభమైనా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. మరమ్మతుల కోసం రూ.10లక్షలు మంజూరైనట్లు హెచ్ఎం తెలిపారు. తాడ్వాయి మండలం కాల్వపల్లి, బయ్యక్కపేట ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఉండడంలేదు. బాల బాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పించినా పిల్లలు ఉండడానికి ఇష్టపడడంలేదు. దీంతో నిర్వహణ లేక తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. పోచాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మారుమూల ప్రాంతం కావడంతో అధికారుల పర్యవేక్షణ లేదు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గిరిజన బాలుర హాస్టల్ లో మరుగుదొడ్లు, తాగునీటి సమస్య అధికంగా ఉంది. వాజేడు ఎస్సీ బాలుర హాస్టల్‌లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. తరచూ బయటి వ్యక్తులు వచ్చి హాస్టల్‌లో ఉంటున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

అరకొర వసతులు.. విద్యార్థుల అవస్థలు

- అద్దె భవనాల్లో మైనార్టీ, జ్యోతిరావు పూలే గురుకులాలు
- మానుకోట జిల్లాలో 'సంక్షేమ' విద్యార్థుల ఇబ్బందులు

మహబూబాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దళిత, గిరిజన, బడుగుబలహీన, మైనార్టీ వర్గాల నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసించే సంక్షేమ వసతిగృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, గదుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఉన్న గదులతోనే సరిపెట్టుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఉన్నా నీటి సౌకర్యం ఉండని పరిస్థితి. ఇక.. చలికాలం ఆరంభమైనా సరిపడా బెడ్లు, పరుపులు లేకపోవడంతో పాటు కిటికీలకు రంధ్రాలు ఉండడంతో గదుల్లోకి చల్లటి గాలి వచ్చి నేలపై పడుకుని చలికి గజగజ వణుకుతున్నారు. మరోపక్క వేడి నీరులేక ఉదయాన్నే చన్నీటి స్నానం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ, గిరిజన, మైనార్టీ వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాలు, కేజీబీవీలు మొత్తం 108 ఉండగా వాటిలో సుమారు 25,360 మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా హాస్టళ్లలో సమస్యలే దర్శనమిస్తున్నాయి. పడకలు లేక నేలపై నిద్రిస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటి వరకు విద్యార్థినులకు దుప్పట్లు రాకపోవడంతో చలికి వణుకుతున్నారు. స్నానాలు చేసేందుకు వేడినీరు లేకపోవడంతో చల్లటి నీటితోనే స్నానాలు చేస్తూ జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. బాలికల వసతిగృహాలు, హాస్టళ్లలో విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండి, గదుల సంఖ్య తక్కువగా ఉంది. పలు చోట్ల విద్యార్థులకు విద్యా సంవత్సరం ఆరంభంలోనే దుప్పట్లు పంపిణీ చేశారు. కిటికీలకు డోర్లు ఉన్నా కొన్ని హాస్టళ్లలో వాటికి దోమ జాలీలు ఏర్పాటు చేయలేదు. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆ దిశగా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం పూర్తిగా అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. వీరికి ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ప్రకారం ఆయా వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



గూడూరు ఎస్సీ హాస్టల్‌లో పనిచేయని ఇన్వర్టర్లు



మరిపెడ ఎస్టీ ఆశ్రమంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

అద్దె భవనాల్లోనే గురుకులాలు..

మహబూబాబాద్ జిల్లాలో మూడు మైనార్టీ పాఠశాలలు, మూడు జూనియర్ కళాశాలలు, 5 మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులాలు మొత్తం 11 గురుకుల పాఠశాలలు కూడా అద్దెభవనాల్లోనే నిర్వహిస్తున్నారు. డోర్నకల్ బాలికలు, తొర్రూరు బాలికలు, మహబూబాబాద్ బాలుర ముస్లిం మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. జిల్లాలో 5 మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులాలు ఉండగా గూడూరు, మరిపెడ బాలికలు, తొర్రూరు, మహబూబాబాద్, దంతాలపల్లి బాలురు గురుకుల పాఠశాలల ఉన్నాయి. జిల్లాలో ఉన్న మైనార్టీ, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు కూడా అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. కాగా, కొన్ని వసతిగృహాల్లో వార్డెన్‌లు అందుబాటులో ఉండకపోవడంతో వంట చేసే సమయంలో వంట చేసే కుక్‌లు మెనూ ప్రకారం కాకుండా ఇష్టారీతిన వంట చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సంక్షేమ విద్యార్థుల అరిగోస

జనగామ జిల్లా హాస్టళ్లలో సౌకర్యాల లేమి

జనగామ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సౌకర్యాలు, నిర్వహణ సక్రమంగా లేక జనగామ జిల్లా వసతి గృహాల్లోని విద్యార్థులు అరిగోస పడుతున్నారు. ఏళ్లుగా వసతి గృహాలు నడుస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో పేద విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలో 16ఎస్సీ హాస్టళ్లు, 16 బీసీ హాస్టళ్లు, 10ఎస్టీ హాస్టళ్లున్నాయి. దుప్పట్లు, మంచాల పంపిణీ నామమాత్రంగా జరిగింది. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు మాత్రమే ప్రభుత్వం దుప్పట్లు, కాస్మెటిక్స్ పంపిణీ చేస్తోంది. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు వారే సొంతంగా తెచ్చుకుంటున్నారు. దీంతో విద్యార్థులు చలిలో నిద్రించాల్సి వస్తోంది. దీనికి తోడు చాలా వరకు హాస్టళ్లలో విద్యార్థులకు బెడ్లు కూడా లేవు. ఉన్న మంచాలు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని హాస్టళ్లలో నెల క్రితం దుప్పట్లను పంపిణీ చేసినా అవి చలి తీవ్రతను తట్టుకునేలా లేవని విద్యార్థులు చెబుతున్నారు. చాలా హాస్టళ్లలో సోలార్ వాటర్ హీటర్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు చన్నీటితో స్నానాలు చేస్తున్నారు. ఇక ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లోనే వసతి గృహాలు నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణను అధికారులు పట్టిం చుకోకపోడంతో శిథిలావస్థకు చేరుతు న్నాయి. పాలకుర్తి ఎస్సీ హాస్టల్ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సొంత భవనాలున్న చోట కూడా సరైన వసతులు లేవు. కొన్నిచోట్ల బోర్డులు కూడా ఏర్పాటు చేయక పోవడంతో పై అధికారులు వస్తే అడ్రస్ దొరకని పరిస్థితి. కొన్ని చోట్ల హాస్టళ్లకు ప్రహరీలు లేకపోవడంతో విష సర్పాలు, కీటకాలు, జంతువులు హాస్టల్ లోపలికి వస్తున్నాయి. కొన్ని చోట్ల హాస్టల్ పైకప్పులు, గోడలు పెచ్చు లూడిపోయి ప్రమాదకరంగా ఉన్నా యి. తలుపులు, కిటికీలు దెబ్బతిని దోమలు, పురుగులు వస్తున్నాయి. వర్షా లు కురిసినప్పుడు వర్షపు నీరంతా గదుల్లోకి వచ్చి విద్యార్థులు పడుకోవడానికి ఇబ్బంది కలుగుతోంది. కొన్ని హాస్టళ్లలో కిటికీలు, బెడ్లు తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. కిటికీలకు దోమ తెరలు లేక దోమలతో రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని చోట్ల దోమ తెరలు ఉన్నా అవి చిరిగిపోయాయి.



జఫర్‌గఢ్‌లోని బీసీ బాలుర హాస్టల్‌లో దెబ్బతిన్న కిటికీలు, గోడలు

కనిపించని వార్డెన్లు, నైట్ వాచ్‌మెన్‌లు

జిల్లాలో వసతి గృహ సందర్శన వెళ్లిన సమయంలో చాలా చోట్ల వార్డెన్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. చాలా వరకు హాస్టళ్లలో నైట్ వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా నిద్రిస్తున్నారు. దేవరుప్పుల బీసీ హాస్టల్, కొడకండ్ల ఎస్సీ హాస్టల్, బచ్చన్నపేట ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్లు అందుబాటులో లేరు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థులపై అజమాయిషీ లేకపోవడంతో రాత్రంతా బయట తిరిగి ఏ వేళకో హాస్టళ్లకు చేరుకుంటున్నారన్న విమర్శలున్నాయి.



స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీ గురుకుల హాస్టల్‌లో తుప్పు పట్టిన మంచాలు, కిటికీ

క్రైం కార్నర్

డ్రైవర్‌పై కేసు నమోదు

పెద్దవంగర, నవంబర్13 (ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో గంట్లకుంట శివారు అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోతు శాంతమ్మ (63), జాటోతు వెంకన్న (48) మృతికి కారణమైన పోచారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మద్దెల సాయితేజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కారు అతి వేగంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతుడు జాటోతు వెంకన్న కుమారుడు మోదీన్ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

నర్సింహులపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సురేష్ బుధవారం తెలిపారు. కౌసల్యాదేవిపల్లి సమీపంలోని ఆకేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ సంయుక్త దాడులు నిర్వహించగా ఇసుక లోడుతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పరిశీలించగా, అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

'చిల్లర కాంటాలను అరికట్టాలి'


మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చుట్టు శివారు ప్రాంతాల్లోనూ రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తూ.. నష్టపరుస్తున్న చిల్లర కాంటాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా, ప్రగతిశీల అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శంషీర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ మార్కెట్ చుట్టుపక్కల మార్కెట్ లైసెన్స్‌లు లేని చిల్లర కాంటాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, అలాగే ప్రైవేట్ కొనుగోళ్లు కూడా అధికం కావడంతో రైతులు మోసపోతున్నట్లు ఆయన వివరించారు. పత్తి, మిర్చి, వరి, అపరాలను చిల్లర కాంటాల్లో విక్రయించి నష్టపోతున్నారన్నారు. మార్కెట్ అధికారులు, రెవెన్యూ అధికారులు సైతం చిల్లర కాంటాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వెంటనే మార్క్‌ఫెడ్ సంస్థ చేత మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైండ్ల యాకయ్య, బండపల్లి వెంకటేశ్వర్లు, ఈక బిక్షం, నాగేశ్వర్‌రావు, వీరస్వామి, సమ్మయ్య, సారయ్య, సురేష్, బుచ్చిరాములు, సత్యం పాల్గొన్నారు.

'వడ్ల కొనుగోళ్లలో ప్రమాణాలు పాటించాలి'

కేసముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఖరీదులు చేయాలని ధన్నసరి సొసైటీ అధ్యక్షుడు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు సూచించారు. కేసముద్రం రైతు వేదికలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో దొడ్డు, సన్న రకాలను వేర్వేరుగా ఖరీదులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేసముద్రం సొసైటీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్య, ఏవో వెంకన్న, సొసైటీల సీఈవోలు మల్లారెడ్డి, వెంకటాచలం పాల్గొన్నారు.


కేసముద్రంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రంగారావు

'ఒత్తిడిని తగ్గించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఉపాధ్యాయులపై ఎలాంటి ఒత్తిడిలేకుండా లేకుండా స్వేచ్ఛగా సర్వే పూర్తి చేసేలా చూడాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఎంపీడీవో రఘుపతిరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈనెల 9 నుంచి ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. బిక్షపతి, రవీందర్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

రైతులు దళారుల మాటలు నమ్మొద్దు

● మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్ అన్నారు. గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు 224 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. గూడూరులో ఐకేపీ ఆధ్వర్యంలో 06, జీసీసీ ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ధాన్యానికి సరిపడ గన్నీబ్యాగులు, టార్పాలిన్ కవర్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సన్నరకం ధాన్యం ధర క్వింటాకు రూ.2321, దొడ్డురకం ధాన్యానికి రూ.2300 ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్‌రావు, ఏవో అబ్దుల్‌మాలిక్, ఎంపీడీవో వీరస్వామి, ఏపీఎం రవీందర్, సీసీలు కందిక రమేష్, కందిక ఐలయ్య, మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, ఎడ్ల నరేష్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, బోయినపల్లి సతీష్‌రావు, వాంకుడోతు కొమ్మాలు, అజ్మీర సురేష్, చంటిస్వామి పాల్గొన్నారు.


స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థి సోహెల్ డీఈవోగా, ధనుంజయ్ ప్రధానోపాధ్యాయుడుగా, ఉపాధ్యాయులుగా శివ, అభిషేక్, విఘ్నేష్, కాజల్, అంజలి, వ్యాయామ ఉపాధ్యాయుడుగా ముఖేష్ విధులు నిర్వహించారు. ఇన్చార్జి హెచ్‌ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ఉప్పలయ్య, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, సతీష్‌కుమార్, శిభారాణి, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, వీరభద్రం, యుగందర్ పాల్గొన్నారు.

'హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలి'


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డుల రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా హోంగార్డులు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర హోంగార్డుల రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. డిసెంబర్ 6న హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆవిర్భావ రోజున హోంగార్డులకు సీఎం రేవంత్‌రెడ్డి తీపికబురు అందించే కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు జంపయ్య, ఉపాధ్యక్షుడు యాకయ్య, కోశాధికారి ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా : మాజీమంత్రి ఎర్రబెల్లి

పెద్దవంగర, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గంట్లకుంట గ్రామ శివారులోని అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోతు శాంతమ్మ (63), జాటోతు వెంకన్న(48) రోడ్డు ప్రమాదంలో మరణించగా మృతదేహాలను పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సిబ్బంది చిలుక టైటాస్ (45) అనారోగ్యంతో మరణించడంతో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మృతుల కుటంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. వారి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అన్నారు. మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వి.రామచంద్రయ్య శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదరు ఐలయ్య, పల్లా సుందర్‌రాంరెడ్డి, శ్రీరాం సుధీర్, శ్రీరాంసంజయ్, వెంత్రామయ్య, సమ్మయ్య, వంగ అర్జున్, భిక్షపతి, అనుదీప్, ప్రవీణ్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబసభ్యులను ఓదార్చుతున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కార్తీకపున్నాన కందగిరికి పోదాం పదా..


కందగిరి పర్వతంపై ఉన్న లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం

(5వ పేజీ తరువాయి)

అంటారు. ఇక్కడికి ఒక పర్యాయం స్వామిని దర్శించుకొనుటకు సప్తరుషులు వచ్చి పుష్కరిణిలో స్నానం చేశారట. ఇక్కడ స్నానం చేస్తే, చర్మవ్యాధులు పోతాయని భక్తు నమ్మకం. ఇక్కడే ఉండే మధుర పుష్కరిణికి, నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు కానీ, ఇందులో నీరు కలకాలం ఉంటుంది. వెదురు, దేవదారు, తింత్రిణీ వృక్షాలతో కీకారణ్యాన్ని మరిపిస్తుంది. అంతేకాక పూర్వకాలంలో యుద్ధానికి అవసరమయ్యే మందుగుండు సామగ్రి దాచుకునేందుకు నిర్మించిన మందులకొట్టు భక్తులను ఆకర్షిస్తుంది. గుర్రాల మండవ, కోటి లింగాలు కట్టిపడేస్తాయి.

గుప్త నిధులు, నిక్షేపాలు

కందిగిరిపై, క్రింది భాగంలో నిధులు, నిక్షేపాలు అన్నీఇన్నీ కావని ప్రతీతి. గుప్తనిధుల కోసం కొండ కింది భాగంలో భోగం మహిళ గుడిలో గుప్తనిధుల తవ్వకాలతో కూల్చివేశారు. ప్రభుత్వమే ఇక్కడ నిధులను తవ్వించాలనే డిమాండ్ ప్రజల నుంచి ఉంది. అడవిలో పక్షులు..జంతువులుకందికొండ గుట్టపై ఉన్న అరణ్యంలో నెమళ్లు, సహా అనేక అడవిపక్షులు భక్తులను ఆకట్టుకుంటాయి. దుప్పిలు, ఎలుగుబంట్లు, అడవిపందులు, కొండెంగలు పర్వతాన్ని ఎక్కేవారిని అలరిస్తాయి.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలను నిర్వహించారు. అర్చకుడు తాటిపాముల శివకృష్ణమాచారి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో ట్రస్టు చైర్మన్ పమ్మి సనాతనాచారి-అనురాధ, తాడూరి మాధవాచారి-గీతాదేవి, ఎర్రోజు లక్ష్మణాచారి-రమాదేవి, వలబోజు సోమయ్య భాగ్యలక్ష్మీ, రత్నామాచారి, సత్యవతి, వీరయ్యచారి, హరిక్రిష్ణ, స్వరూప, సాగర్ సత్యమనోరమ, పూర్ణాచారి, వీరభద్రాచారి, రాకేష్, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న దేవాలయ ట్రస్టు బాధ్యులు

జాతర కోసం ప్రత్యేక వైద్య బృందాలు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్

కురవి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కందికొండ జాతరలో భక్తులకు కోసం నాలుగు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ తెలిపారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం కందికొండ జాతరపై బుధవారం కురవి పీహెచ్‌సీలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల కోసం అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పారా మెడికల్ సిబ్బందికి డ్యూటీలు వేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రమీల, పీహెచ్‌సీ వైద్యాధికారి విరాజిత, డాక్టర్లు సారంగం, సుధీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సీహెచ్‌వో శ్రీహరి, వొబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఎం మానుకోట నగర కార్యదర్శిగా బానోత్ సీతారాంనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం మహబూబాబాద్ సిటీ (నగర) కార్యదర్శిగా ఏటిగడ్డ తండాకు చెందిన సీతారాంనాయక్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని వర్తక సంఘం భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఎం పట్టణ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో బుధవారం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌సీపీఎం నగర కమిటీని ప్రకటించారు. నగర కార్యదర్శిగా బానోత్ సీతారాంనాయక్, కమిటీ సభ్యులుగా సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, కె.నాగన్న, చీపిరి యాకన్న,హేమానాయక్, శాగంటి భాగ్యమ్మ, బానోత్ వెంకన్న, నక్క సైదులు ఎన్నికయ్యారు.

60 ఫీట్ల రోడ్డుగా మార్చాలని వినతి

కేసముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేద్కర్ సెంటర్ నుంచి విలేజి దర్గా వరకు రోడ్డును వందఫీట్లు కాకుండా 60 ఫీట్లకు తగ్గించాలని కోరుతూ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు బుధవారం విజ్ఞప్తి చేశారు. వంద ఫీట్ల రోడ్డుతో తమ ఇళ్లు, దుకాణాలు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎక్కువ మందికి నష్టం కాకుండా రోడ్డు విస్తరణను తగ్గించి పనులు చేయిస్తానని హామీ ఇవ్వడంతో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన మహిళలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, అంగోత్ బాల, మంగీలాల్, ఎండి.సర్వర్, జావెద్, వెన్ను ఎల్లయ్య, ఎం.శ్రీను, మాన్‌సింగ్, పాషా, ఎస్వరూప పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఎంఈవో బుచ్చయ్య

తొర్రూరు రూరల్, నవంబరు 13 (అంధ్యజ్యోతి) : విద్యార్థులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఎంఈవో మహంకాళి బుచ్చయ్య అన్నారు. బుధవారం తొర్రూరు మండలం మాటేడు, ఫత్తేపురం ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమ య్యేరీతిలో విద్యాబోధన చేయాలని, సామర్థ్యాలను పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అనుగుణంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనంపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీ రమేష్ తదితరులుపాల్గొన్నారు.

'జీపీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి'

దంతాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో పని చేసే పంచాయతీ కార్యదర్శులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వివేక్రమ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వేములపల్లి, లక్ష్మీపురం, గున్నేపల్లి, రామానుజపురం, తూర్పుతండా గ్రామాల్లో పర్యటించారు. ఈనెల 6 నుంచి ఇంటింటా చేపడుతున్న కులగణన సర్వే సిబ్బందికి, ఇతర అధికారులకు సహకరించాలన్నారు. తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహ్మద్ అప్సర్ పాష, పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

'సర్వేలో తప్పుడు సమాచారం ఇవ్వొద్దు'

దంతాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమంలో ప్రజలు తప్పుడు సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు ఇవ్వొద్దని తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో తూర్పు తండా, ఆగాపేట, రామవరం, గున్నేపల్లి, దంతాలపల్లిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మెట్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అప్సరపాష, పంచాయతీ కార్యదర్శులు, ఏశబోయిన వెంకన్న, సిరబోయిన శ్రీనువాస్, నాగార్జున, అజయ్, మధు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత అన్నదానం

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో మాల ధరించిన స్వాములకు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ దారం ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రూరులోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో నవంబర్ 15వ తేదీ పౌర్ణమి రోజున ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అదేరోజు నుంచి అయ్యప్ప స్వాములకు ఉచిత అన్నదానం 41 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేంకటేశ్వర ఆలయంలో సాలగ్రామ పూజ

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు వద్ద భక్తులు సాలగ్రామానికి పూజలు నిర్వహించి అర్చకులకు దీపాదానం, దక్షిణ తాంబూలాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆరుట్ల శ్రీకాంతాచార్యులు మాట్లాడుతూ ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున పాలకడలిలో యోగ నిద్రకు ఉపక్రమించిన శ్రీమహా విష్ణువు కార్తీక ఏకాదశి రోజున మేల్కొంటాడని ఇది పురాణాల్లో కథనం అన్నారు. దీనినే సాలగ్రామంగా పూజిస్తారని తెలిపారు. భక్తులు స్వామి వారికి అర్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

డోర్నకల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని తాళ్లూరిబాబు యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాధర్‌రావు అన్నారు. చిల్కోడులో బుధవారం తలసేమియా, సికిల్‌సెల్ బాధితుల కోసం ఉచిత రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని, ముఖ్యంగా యువత రక్తదానం చేసేందుకు ముం దుకు రావాలని సూచించారు. దాతల నుంచి 25 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ ఖమ్మం బాధ్యులు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్‌కె.నజీర్, డబ్బా శ్రీనివాస్, మంద రామారావు, రాజు, అనంతుల ఉపేందర్, వీరబాబు, వినోద్, నాగేశ్వర్‌రావు, రామారావు, శ్రీనివాస్, మాకుల్, అనంతరెడ్డి, వెంకన్న, శ్రీధర్, సంపత్, అభిలాష్, జానీ, రాములు, అఖిల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించాలి

● టీపీటీఎఫ్ మండల బాధ్యుడు సాయిబాబా

డోర్నకల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ, కులగణన సర్వే చేస్తున్న ఉపాధ్యాయులపై పనిఒత్తిడిని తగ్గించాలని టీపీటీఎఫ్ మండల బాధ్యులు సాయిబాబా అన్నారు. డోర్నకల్ ఎంపీడీవో శ్రీనివాస్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు పని ఒత్తిడిని ఎదు ర్కొంటున్నారని చెప్పారు. ఒక్కొక్క కుటుంబ సర్వేకు కనీసం 40 నిమిషాలు సమయం పడుతుందని, ప్రతిరోజు 20 కుటుంబాలను సర్వే చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వెంటనే సర్వే చేస్తున్న ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి పాటు పడిన సైదుల్‌రావు

సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు శ్రీనివాస్

గార్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నమ్మిన సిద్ధాంతం కోసం సీపీఎం పక్షాన పేదల అభ్యున్నతి నిరంతరం పాటు పడిన మహాయోధుడు వేజేళ్ల సైదుల్‌రావు చేసిన సేవలు ఎప్పటికి మరువలేమని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కందునూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సత్యనారాయణపురం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు సైదుల్‌రావు 23వ వర్థంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద పార్టీ జెండా వేగర వేసి, సైదుల్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల సమస్యలపై అనేక పోరాటు చేసిన సీపీఎం పార్టీ అభివృద్ధి పాటు పడిన మహాయోధుడు సైదుల్‌రావు అన్నారు. సైదుల్‌రావు పోరాట స్ఫూర్తితో నేటితరం కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. సీపీఎం గార్ల, బయ్యారం మండల కార్యదర్శులు అలవాల సత్యవతి, నంభూరి మధు, నాయకులు కై.బాబు పాల్గొన్నారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

దంతాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో రైతాంగానికి ఏలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామన్న ఎన్నికల హామీని వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం మండలంలోని రైతులు ఆరోపిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలో కూడా రైతులకు ఏలాంటి రుణ విముక్తి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్ద పీటవేస్తుందన్న నమ్మకంపై ఆందోళన కలిగిస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం అర్హులైన వారికి ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకట్‌రాం, శ్రీనువాస్, పోట్యా నాయక్, బద్రూనాయక్, వెంకన్న, హరిచంద్ర, సీతారాంనాయక్, దుర్గేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం (టీఏవోఏస్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా జక్కుల ఉదయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.రవీందర్‌రెడ్డి, కుమార్‌యాదవ్ ప్రకటించారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో బుధవారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులంతా కలిసి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బోడ వీరాసింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.చాయ్‌రాజు, కోశాధికారిగా, బానోత్ రాంజీ, సహాయ కార్యదర్శిగా బి.మహేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎన్.తిరుపతిరెడ్డి, జావెద్‌ఖాన్, కల్చరల్ సెక్రటరీలుగా మురళీమోహన్, నర్సింహారావు, పబ్లిసిటీ కార్యదర్శిగా మోహన్‌లను ఎన్నుకున్నట్లు కేంద్ర కమిటీ సభ్యులు తెలిపారు.

నరసాయమ్మ మృతి పట్ల సంతాపం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం ప్రధాన కార్యదర్శి రాంపిల్ల జయప్రకాశ్ తల్లి నరసాయమ్మ మృతి పట్ల తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉన్నం వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యక్షుడు సూకల లింగారెడ్డి, తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర ప్రతినిధి సింగు రమేష్, బి.రవీంద్రగుప్తా, చిలుకపల్లి ముత్తులింగం బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో విజయవాడ నగరంలో స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిల్ల నరసాయమ్మ పాల్గొని బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. స్వాతంత్రం సిద్ధించాక కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సలహామండలిలో నరసాయమ్మ పని చేశారని గుర్తు చేశారు. దేశ రాష్ట్రపతులు ప్రణబ్‌ముఖర్జీ, రామ్‌నాథ్‌కోవింద్ వంటి ప్రముఖుల చేతులమీదుగా నరసాయమ్మ సత్కారాలు పొందారని తెలిపారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. నరసాయమ్మ కుటుంబ సభ్యులకు తమ సానుభూతి వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

కురవి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కుల గణన జరుగకనే వెనుకబడిన కులాలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురయ్యాయని, తక్షణమే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాజోలులో సీపీఎం కురవి మండల 8వ మహాసభను జక్కుల మల్లయ్య, మాలోతు కిషన్, కొమ్ము మంజుల అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు, శెట్టి వెంకన్న, మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నల్లపు సుధాకర్, పిట్టల వెంకన్న, ఎస్‌కె.మల్సూర్, నాలం వెంకన్న, గొల్లపల్లి బిక్షపతి, ఆమెడ నాగయ్య పాల్గొన్నారు.


గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌పీ గ్యాస్ మేనేజరు బోనగిరి ప్రసాద్

'గ్యాస్‌పై అవగాహన ఉండాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో వాడే గ్యాస్ వినియోగంపై ప్రతి ఇక్కరు అవగాహన కలిగిఉండాలని మానుకోట హెచ్‌పీ గ్యాస్ మేనేజరు బోనగిరి ప్రసాద్ అన్నారు. మహబూబాబాద్‌లోని వికాస్ జూనియర్ కళాశాలలో బుధవారం హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో సేఫ్టీ క్లినిక్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ వినియోగించే సమయంలో తెలిసి తెలియక చిన్నచిన్న పొరపాట్లు చేయడంతో పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్యాస్ మొద్దు, రెగ్యులేటర్ గ్యాస్ పైపు ఏ విధంగా ఉపయోగించాలి, ఉపయోగించే సమయంలో ఎదురయ్యే సమస్యలు ఎలా ఉంటాయి. వాటి లైఫ్ టైం ఎంత ఉంటుంది అనే వాటిపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

● మరిపెడ (ఆంధ్రజ్యోతి) : మరిపెడ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సురేష్ గ్యాస్ సేఫ్టీపై బుధవారం అవగాహన కలిపించారు. గ్యాస్ ఏ విధంగా వాడాలి, ప్రమాదవశాత్తు మంటలు ఏర్పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకేజీని అరికటట్టే విధానంపై విద్యార్థులకు విశదీకరించారు. హెచ్‌ఎం అనంతరావు, టీచర్లు రాంమోహన్, జనార్ధనాచారి, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిసాగుతో రైతులకు లాభాలు

కురవి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధిక సాంద్రత పత్తిని సాగుచేయడం ద్వార అధిక దిగుబడి సాధించవచ్చునని మల్యాల కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. కురవిలోని మేక వెంకటరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో అధిక సాంద్రత పత్తిసాగుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అధిక సాంద్రత పత్తిసాగులో మొక్కల సంఖ్య 20 వేల వరకు ఉండి 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఏవో నర్సింహారావు, హెచ్‌వో శాంతిప్రియ, ఎస్.కిశోర్‌కుమార్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రశిబిరం

తొర్రూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తూర్, అమ్మాపురం గ్రామాల్లో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా నేత్రవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, శస్త్రచికిత్స అవసరం ఉన్న 16 మందిని హైదరాబాద్‌కు తరలించినట్లు క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీజీ లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, తమ్మెర విశ్వేశ్వరరావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.